మలుపులు.. మృత్యు పిలుపులు



ప్రమాదకరంగా నాంపల్లి - వేములవాడ రహదారి



- నాంపల్లి - వేములవాడ రోడ్డుపై తరచూ ప్రమాదాలు
- భయంభయంగా రాకపోకలు
- చర్యలు తీసుకోవాలని డిమాండ్

వేములవాడఅర్బన్: దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున నిత్యం తరలివస్తుంటారు. రోజురోజుకూ వాహనాల రద్దీ పెరగడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పట్టాలంటే రోడ్డు విస్తరణ చేయాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు. కరీంనగర్, వరంగల్ నుంచి వేములవాడ దేవస్థానానికి వచ్చే వాహనాలు ఈ రహదారి నుంచి వస్తుంటాయి. అలాగే ఆరెపల్లి, సంకెపల్లి, రుద్రవరం, అనుపురం, ఇస్లాంనగర్, గోల్లపల్లె గ్రామాల నుంచి ప్రజలు నిత్యం వేములవాడకు వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు. ఈ రహదారిలో నిత్యం వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది.

నాంపల్లిలో...

వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లి శివారులోని నాంపల్లి - వేములవాడ ప్రధాన రహదారిలోని గుడికుంట కట్ట నుంచి వేములవాడ వరకు ఫోర్ వే లైన్ రోడ్డు వేశారు. గుడికుంట కట్ట మీద నుంచి నాంపల్లి పాత గ్రామపంచాయతీ వరకు డబుల్ రోడ్డు ఇరుకుగా ఉంది. కిలో మీటర్ దూరంలోనే ఐదు ప్రమాదకరమైన మూలమలుపులు ఉన్నాయి. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకుండా ప్రమాదకర మూలమలుపులు ఉండటంతో ప్రయాణికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణి సాగించాల్సి ఉంటుంది. ఈ రహదారిలోని మూలమలుపుల వద్ద రాత్రిపూట తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు పట్టించుకొని మూలమలుపుల వద్ద రోడ్డు విస్తరించాలని స్థానికులు కోరుతున్నారు.

భయంగా ఉంది



నాంపల్లి రహదారిలో మూలమలుపులు ఎక్కువగా ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రిపూట ఈ రోడ్డుగుండా వెళ్లాలంటే భయంగా ఉంది. అధికారులు పట్టించుకొని మూలమలుపుల వద్ద తగు చర్యలు తీసుకోవాలి.

– దండుగుల నాంపల్లి, నాంపల్లి

తరచూ ప్రమాదాలు



నాంపల్లిలోని రహదారిలో ఇరుకురోడ్డుతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. చిన్న పిల్లలు రోడ్డుమీదకు వస్తుండటంతో ఇబ్బందిగా ఉంది. అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా మూలమలుపుల వద్ద రోడ్డును విస్తరించాలి.

– పోషవేని బాలయ్య, నాంపల్లి

డే కేర్ సెంటర్ ఏర్పాటు చేయాలి



సిరిసిల్ల టౌన్: కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు విన్నవిస్తున్న సీనియర్ సిటిజన్లు



వేములవాడ: కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, కౌన్సిలర్లు

సిరిసిల్లటౌన్: జిల్లాకేంద్రంలో సీనియర్ సిటిజన్స్ కోసం డే కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కోరింది. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చేపూరి బుచ్చయ్య నేతృత్వంలో బుధవారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూను కలిసి వినతిపత్రం అందించారు. సీనియర్ సిటిజన్స్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్‌ను శాలువాతో కప్పి శుభాకాంక్షలు తెలిపారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జనపాల శంకరయ్య, దొంత దేవదాసు, గౌరిశెట్టి ఆనందం, ఇరుకుల్ల భాస్కర్ తదితరులున్నారు.

సిరిసిల్ల: కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు రాజన్న ప్రసాదాన్ని రాష్ట్ర దేవాలయాల ఉద్యోగుల జేఏసీ కో చైర్మన్ ఉపాధ్యాయుల చంద్రశేఖర్ బుధవారం అందించారు. కండువా కప్పి సన్మానించారు.

పూలమొక్క అందజేత

కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సందీప్‌కుమార్ ఝూను కలెక్టరేట్‌లో జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ రాఘవరెడ్డి దంపతులు మర్యాద పూర్వకంగా కలిశారు. పూల మొక్కను అందించి కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని, సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడాలని జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ కోరారు.

వేములవాడ: కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సందీప్‌కుమార్ ఝూను వేములవాడ మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి ఆధ్వర్యంలో కౌన్సిలర్ల బృందం శుభాకాంక్షలు తెలిపారు. రాజన్న ప్రసాదం అందించి ఘనంగా సత్కరించారు.

ఎల్లారెడ్డిపేట: నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సందీప్ కుమార్ ఝూను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. నాయకులు గూడూరి ప్రవీణ్, జిందం చక్రపాణి తదితరులున్నారు.

'బండి'కి స్వాగతం పలికిన నాయకులు



గజమాలతో స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

సిరిసిల్ల/వేములవాడరూరల్: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బండి సంజయ్ ఎన్నికై మొదటిసారిగా ఫాజుల్‌నగర్ మీదుగా వేములవాడ వస్తున్న ఆయనకు మండల బీజేపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. క్రేన్ సాయంతో గజమాల వేసి సత్కరించారు. సిరిసిల్లలో పద్మశాలీలు సన్మానించారు.

ఎల్లారెడ్డిపేట: బండి సంజయ్‌కుమార్‌ను నల్లగొండ శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి ఆలయం వద్ద కలిసి, సన్మానించారు. జిల్లా ఉపాధ్యక్షుడు కంచర్ల పర్శరాములు, మండలాధ్యక్షుడు పొన్నాల తిరుపతి రెడ్డి, నాయకులు సత్యంరెడ్డి, సంజీవరెడ్డి, చందుపట్ల లక్ష్మారెడ్డి, మద్దుల బుగ్గారెడ్డి తదితరులున్నారు.



సిరిసిల్లలో సంజయ్‌ను సన్మానిస్తున్న పద్మశాలీలు

ప్రతిభచూపిన విద్యార్థికి సన్మానం

వేములవాడఅర్బన్: వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తిచేసిన గంగిపల్లి దివ్యను ప్రిన్సిపాల్ ప్రమోద్ కుమార్ బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన దివ్య ప్రభుత్వ కళాశాలలో సీఈసీ రెండో సంవత్సరం పూర్తిచేయగా 939 మార్కులు సాధించి ప్రతిభ చాటిందన్నారు. హైదరాబాద్‌లోని కోఠి మహిళా డిగ్రీ కళాశాలలో బీకాం కంప్యూటర్‌లో సీటు సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు అశోక్, అంజయ్య, మహేందర్ రెడ్డి, గోపి, దేవయ్య, రవీందర్, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

అశాస్త్రీయంగా పదోన్నతుల ప్రక్రియ

సిరిసిల్లఎడ్యుకేషన్: పదోన్నతులు అశాస్త్రీయంగా జరుగుతున్నాయని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దోర్నాల భూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. గీతానగర్ ఉన్నత పాఠశాలలో బుధవారం సమావేశంలో మాట్లాడారు. ఒక ఉపాధ్యాయునికి ఒకటి కంటే ఎక్కువ పదోన్నతులకు అవకాశం ఇచ్చారని, దీని ద్వారా ఒక పోస్టులో చేరితే మిగతావి ఖాళీగా ఉంటున్నాయన్నారు. దీంతో తరువాత సీనియారిటీలో ఉన్న ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. జరిగిన నష్టాన్ని నివారించడానికి తక్షణమే మిగులు పోస్టులకు పదోన్నతులు కల్పించి సీనియారిటీలో ఉన్నవారికి న్యాయం చేయాలని కోరారు. నాయకులు మైలారం తిరుపతి, బడుగు రాంబాబు, జగిత్యాల శ్రీనివాస్, రవిబాబు, తిరుపతి, నరేందర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు



వేములవాడ: రాజన్న ఆలయం ముందు కేక్ కట్ చేస్తున్న ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్, నాయకులు



సిరిసిల్ల టౌన్: గాంధీచౌక్‌లో..

సిరిసిల్లటౌన్: జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. గాంధీచౌక్‌లో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్ ఆధ్వర్యంలో కేక్ కోసి సంబరాలు నిర్వహించారు. టీపీసీసీ సభ్యులు నాగుల సత్యనారాయణగౌడ్, సంగీతం శ్రీని వాస్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కామని వనిత, తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ: రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా రాజన్న ఆలయం ముందు భారీ కేక్‌ను కట్ చేసి పేదలకు పంపిణీ చేశారు. ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ మాట్లాడారు. పట్టణ, బ్లాక్ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్, సాగరం వెంకటస్వామి, కౌన్సిలర్ అజయ్, నాయకులు సంగ స్వామియాదవ్, చిలుక రమేశ్, పాత సత్యలక్ష్మి, కనికరపు రాకేశ్, సూగురి లక్ష్మి, గూడూరి మధు, తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: కోనరావుపేటలో కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంతో పాటు రాచర్లగొల్లపల్లిలో రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. కేక్ కట్‌చేసి పంపిణీ చేశారు.

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలకేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించారు.

ముస్తాబాద్: ముస్తాబాద్‌లో రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకల సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ గుండం నర్సయ్య, ఎంపీటీసీ శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు గజ్జెల రాజు, కొండం రాజిరెడ్డి, శ్రీనివాస్, బాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నరేశ్, మట్ట రమణారెడ్డి, పాల్గొన్నారు.

చందుర్తి: రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను జెడ్పీటీసీ నాగం కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు.

బోయినపల్లి: మండలకేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకల సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, డీసీఎమ్మెస్ డైరెక్టర్ ముదుగంటి సురేందర్‌రెడ్డి, పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండలకేంద్రంలో పార్టీ మండల అధ్యక్షులు భూత శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు హరిలాల్ నాయక్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు తుడుము రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండలకాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకల సందర్భంగా నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. మండలశాఖ అధ్యక్షుడు హమీద్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన మహిళ ఇంటికి..

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రానికి చెందిన ఎనగందుల భూదవ్వ అదృశ్యం కాగా బుధవారం ఇంటికి చేరుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలకేంద్రానికి చెందిన భూదవ్వ మంగళవారం ఇంట్లోంచి వెళ్లి రాత్రి అయినా తిరిగి రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు రాత్రి వరకు ఆమె ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో భర్త ఎనగందుల రాములు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో భూదవ్వ సిద్దిపేట జిల్లా దుబ్బాకలో బంధువుల ఇంట్లో ఉన్నట్లు తెలుసుకొని అక్కడికి వెళ్లి ఆమెను ఇంటికి తీసుకొచ్చారు. దీంతో అటు పోలీసులు, ఇటు భూదవ్వ కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

స్కూల్ బస్సు తనిఖీ

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలానికి చెందిన ఓ ప్రైవేట్ పాఠశాల బస్సులో టెక్స్ట్ బుక్స్ తరలిస్తున్నారన్న విద్యార్థి నాయకుల సమాచారం మేరకు ఇల్లంతకుంట పోలీసులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ బస్సును తనిఖీ చేయగా బుక్స్ లభించడంతో సీజ్‌చేశారు. ఈ విషయంపై పోలీసులు గానీ విద్యాశాఖ అధికారులు ఎలాంటి ప్రకటన చేయలేదు.

నేతన్నలకు నిరంతర ఉపాధి కల్పించాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మూశం రమేశ్



మాట్లాడుతున్న మూశం రమేశ్

సిరిసిల్లటౌన్: పవర్‌లూం కార్మికులకు ప్రభుత్వ నిరంతర ఉపాధి కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మూశం రమేశ్ డిమాండ్ చేశారు. బుధవారం సిరిసిల్లలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పవర్ లూమ్ పరిశ్రమలో నెలకొన్న విద్యుత్ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. 10హెచ్‌పీలు దాటిన వారికి విద్యుత్ సబ్సిడీ తొలగించి యూనిట్‌కు రూ. 8-50 వసూల్ చేయడంతో పరిశ్రమ వర్గాలు చార్జీల భారాన్ని తట్టుకోలేక పోతున్నాయన్నారు. మరో పక్క పాలిస్టర్ వస్త్రానికి గిరాకీ లేక భీములు ఇచ్చే యజమానులు ఆసాములకు పని ఇవ్వడం లేదన్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ ఇంత ఆటుపోట్లను ఎదుర్కొంటున్న నేపథ్యంలో రాష్ట్ర సర్కారు మిన్నకుండటం శోచనీయమన్నారు. వస్త్ర పరిశ్రమ సంక్షేమం కోసం ఈనెల 21న చేపడుతున్న పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్న సమావేశానికి కార్మికులు పాల్గొనాలని కోరారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోడం రమణ తదితరులున్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



తంగళ్లపల్లి: ఆది శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న గ్రామ పంచాయతీ కారోబార్లు

తంగళ్లపల్లి: గ్రామ పంచాయతీల్లో కారోబార్‌లుగా పనిచేస్తున్న తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా గ్రామ పంచాయతీ కారోబార్ సంఘం ఆధ్వర్యంలో వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సురేశ్ మాట్లాడుతూ జీవో నం.51ను రద్దుచేయాలని, కారోబార్‌లను కేటగిరీల వారీగా పర్మినెంట్ చేయాలని కోరారు. తమ సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తానని ఆది శ్రీనివాస్ హామీ ఇచ్చారన్నారు. అనంతరం ఆదిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఉపాధ్యక్షుడు న్యాత నర్సయ్య, సభ్యులు నేరోజు వెంకటరమణ, మహేందర్, ఎస్.శ్రీనివాస్, శేఖర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

సబ్‌డివిజన్ పనులు ఎల్లారెడ్డిపేటలో కొనసాగించాలి

ఎల్లారెడ్డిపేట: సబ్ డివిజన్ స్థాయి పనులు ఎల్లారెడ్డిపేటలో జరిగేలాలా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. వేములవాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆది శ్రీనివాస్‌ను మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాల్‌రాజ్‌యాదవ్, యూత్ మండల అధ్యక్షులు బుచ్చిలింగు సంతోష్‌గౌడ్ కలిసి ఉమ్మడి మండలంలోని పలు సమస్యలను వివరించారు. ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, వీర్నపల్లి, ముస్తాబాద్ మండలాలకు కలిపి ఎల్లారెడ్డిపేటలో సబ్ డివిజన్ ఏర్పాటుకు ప్రభుత్వం ముందుకు వచ్చిందన్నారు. మంజూరు కూడా గత ప్రభుత్వం చేసిందన్నారు. అయినప్పటికీ సిరిసిల్లలోనే ఉంటూ పంచాయత్‌రాజ్ శాఖ అధికారులు పనులు చేస్తున్నారన్నారు. ఫలితంగా నాలుగు మండలాల కాంట్రాక్టర్లు, మాజీ సర్పంచ్‌లు ఎంబీ రికార్డులు, పనిచేసిన బిల్లుల కోసం సిరిసిల్లకు వెళ్లాల్సి వస్తోందన్నారు. ఈ విషయంపై ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. కలెక్టర్‌తో మాట్లాడి ఎల్లారెడ్డిపేటలో పంచాయత్ రాజ్ పనులు జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.

సంఘం భూమిని అప్పగించాలి



తహసీల్దార్ సురేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

ముస్తాబాద్: మండలకేంద్రంలో ప్రభుత్వం ముదిరాజ్ సంఘానికి కేటాయించిన స్థలాన్ని అప్పగించాలని ముదిరాజ్ సంఘం నాయకులు తహసీల్దార్ సురేశ్‌కు బుధవారం విజ్ఞప్తి చేశారు. జెడ్పీటీసీ గుండం నర్సయ్య, ఎంపీటీసీ శ్రీనివాస్‌లతో కలిసి ఈ మేరకు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం నాయకులు మాట్లాడుతూ 1980లో మండలకేంద్రంలోని సర్వే నెంబర్ 984లో 11.20 ఎకరాలను అప్పటి ప్రభుత్వం సంఘానికి కేటాయించిందని, అప్పటి సంఘం బాధ్యులపై పట్టాలు మంజూరు చేసిందన్నారు. దీంతో సంఘంలోని కుటుంబాలు పంటలు సాగు చేసుకొని ఉపాధి పొందారన్నారు. సంఘానికి చెందిన భూమిపై తమకే హక్కు ఉందంటూ పట్టాదారులు అంటున్నారని, దీనిపై విచారణ చేసి సంఘానికి చెందిన భూమిని అందరికీ వర్తింపజేసేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు పిట్ల రాంగోపాల్, గజ్జెల రాజు, రవి, విఠల్, సత్యనారాయణ, రమేశ్, దేవేందర్,నర్సింలు, సాయిలు, వెంకటి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి



కొత్త డీటీఆర్‌ను ప్రారంభిస్తున్న కృష్ణహరి

ఎల్లారెడ్డిపేట: గ్రామాల్లో విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు, లూజ్‌వైర్లు, లో వోల్టేజీ సమస్య రాకుండా శాశ్వత పరిష్కారం చూపుతున్నామని సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి అన్నారు. మండలంలోని రాగట్లపల్లిలో బుధవారం ఓవర్‌లోడ్ సమస్యను పరిష్కరించేందుక ఏర్పాటు చేసిన డీటీఆర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, సెస్ ఏఈ పృథ్వీధర్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.



ఘనంగా ఎల్లమ్మ బోనాలు

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలం కందికట్కూర్ శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి జాతర సందర్భంగా బుధవారం ఎల్లమ్మ బోనాలు నిర్వహించారు. డప్పు చప్పుళ్ల మధ్య ఆలయానికి తరలివెళ్లారు. నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు నాయకులు అమ్మవారిని దర్శించుకుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారయణ, సిరిసిల్ల జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, వైస్ చైర్మన్ సిద్ధం వేణు, ఇల్లంతకుంట ఎంపీపీ వుట్కూరి రమణ రెడ్డి ఉన్నారు.

వనభోజనాలకు తరలిన కుల సంఘాలు

వీర్నపల్లి: మండలకేంద్రంలో రజక, కుమ్మర కుల సంఘాల అధ్యక్షుడు కొత్తకొండ నవీన్, దాసారం నడిపి శంకరయ్య, ఆధ్వర్యంలో బుధవారం వనభోజనాలకు తరలివెళ్లారు. చెట్లకింద సహపంక్తి భోజనాలు చేసి కుటుంబ సభ్యులు, బంధువులతో రోజంతా సరదాగా గడిపారు.

క్లుప్తంగా

లక్ష్య సాధనకు కృషిచేయాలి



నోట్‌బుక్స్ అందిస్తున్న ఫౌండేషన్ బాధ్యులు

సిరిసిల్లఎడ్యుకేషన్: పట్టణంలోని ఎంపీపీఎస్ నెహ్రూనగర్‌లో విద్యనభ్యసిస్తున్న 170 మంది విద్యార్థులకు స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నోట్‌బుక్స్ అందించినట్లు ప్రధానోపాధ్యాయుడు గణేశ్ తెలిపారు. విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించి లక్ష్య సాధనకు కృషిచేయాలని స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కోమాకుల ఆంజనేయులు, శ్రీపతి కాశీరాం అన్నారు. ఏఏపీసీచైర్మన్ చిలుక అరుణ, ఉపాధ్యాయులు సునీత, వాసాల హరిప్రసాద్, దివ్య స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు నవీన్, గుండెల్లి గోపి, మల్లేశం, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

వెటరన్ రామానుజమ్మకు అభినందన

సిరిసిల్లటౌన్: వెటరన్ అథ్లెట్ టముటం రామానుజమ్మ ఇటీవల జరిగిన ఇంటర్నేషన్ మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో రెండు గోల్డ్‌మెడల్స్, ఒకటి సిల్వర్ మెడల్స్ సాధించింది. అయోధ్యలో జూన్ 5 నుంచి 7 వరకు జరిగిన పోటీల్లో 70 ఏళ్ల గ్రూప్‌లో 1500, 800 మీటర్ల పరుగు పందెంలో గోల్డ్ మెడల్స్, 200 మీటర్స్‌లో సిల్వర్ మెడల్ సాధించింది. ఆమెను బుధవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అభినందించారు.

రక్తహీనతపై అవగాహన



విద్యార్థినులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తంగళ్లపల్లి: మండలకేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ, ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో బుధవారం జిల్లాస్థాయి రక్తహీనత (సికిల్ సెల్ ఎనీమియా) నివారణ బృందం ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి స్నేహ రక్తహీనపై విద్యార్థినులకు అవగాహన కల్పించి, వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ తీశారు. ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ ఇంజినీర్ రామకృష్ణ, ఏటీడీవో దివాకర్, సీహెచ్‌వో రామకృష్ణ, కోనరావుపేట, సిరిసిల్ల విద్యార్థులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

ముస్తాబాద్: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా సెస్ పనిచేస్తోందని డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి పేర్కొన్నారు. మండలకేంద్రంలో ఈదురుగాలులు, వర్షాలకు కూలిపోయిన విద్యుత్ స్తంభాలు, విద్యుత్ లైన్ల మరమ్మతు పనులను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ వందలాది సంఖ్యలో విద్యుత్ స్తంభాలు కూలిపోయినట్లు తెలిపారు. శిథిలావస్థలో ఉన్న స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు దీటి నర్సింలు, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

డ్రైనేజీలు శుభ్రం



మురుగుకాలువను శుభ్రం చేస్తున్న జీపీ సిబ్బంది

సాక్షి స్పందన

రుద్రంగి: మండలకేంద్రంలో అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీలను జీపీ సిబ్బంది శుభ్రం చేశారు. 'అస్తవ్యస్తంగా డ్రైనే జీ' అనే శీర్షికన బుధవారం సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు సిబ్బందితో డ్రైనేజీలను శుభ్రం చేయించారు.

దీక్షకు తరలిన కళాశాలల యాజమాన్యాలు

వేములవాడఅర్బన్: రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలలకు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని కోరుతూ అన్ని కళాశాలల యాజమాన్య సభ్యులు హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద చేపట్టిన దీక్షను తరలివెళ్లారు. డిగ్రీ కళాశాలల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జితేందర్‌రావు తదితరలున్నారు.

ఆర్థికసాయం అందజేత

బోయినపల్లి: మండలంలోని కొదురుపాక గ్రామానికి చెందిన చంద్రశేఖర్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని 1995-96 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు బుధవారం పరామర్శించి అనంతరం రూ.17వేలు ఆర్థికసాయంగా అందించారు. పూర్వ విద్యార్థులు ఎలగందుల కనుకయ్య, అన్నమల్ల మోహన్‌బాబు, మొగిలి కనుకయ్య, తదితరులు ఉన్నారు.